సాక్షి అనకాపల్లి

శుక్రవారం : 6 : జూన్ : 2025



దిక్కులేని జీవీఎంసీ

మున్సిపల్ కమిషనర్ లేని పాలన.. విశాఖకు తీరని వేదనగా మిగిలింది. ఫైళ్లు పేరుకుపో తున్నాయి.. పనులు సాగడం లేదు 8లో



చిత్రలేఖన పోటీ

సబ్బవరం: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ వయసుల వారికి యోగాపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.



ఫార్మా ఉద్యోగుల రక్తదానం

పరవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఫార్మాసిటీలో 48 మంది సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

యోగాంధ్రకు నాడే బీజం

ఈనెల 21న విశాఖ సాగర తీరంలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో యోగా దినోత్సవం భారీ ఎత్తున జరగనుంది. ఆ నేపథ్యంలో జిల్లా అంతటా నెల రోజులపాటు 'యోగాంధ్ర' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యాటక ప్రాంతాలు, పార్కులు, సాగర తీరాలు, పాఠశాలలు, చివరకు ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాలు.. ఇలా అన్ని చోట్ల యోగాసనాలు వేయిస్తున్నారు. పిల్లలు, పెద్దలు, ఉద్యోగులతో అభ్యాసం చేయించి, ప్రధాని సమక్షంలో రికార్డు స్థాయిలో యోగా చేయించాలనేది లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో యోగ శిక్షకులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీరిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం నియమించింది. 'ఆయుష్' ద్వారా సంప్రదాయ వైద్యాన్ని విస్తృత పరచి, అందరినీ యోగా వైపు నడిపించాలన్న ప్రయత్నం ఆనాడే ప్రారంభమైంది.



ప్రొటోకాల్ యోగాలో భాగంగా ఆసనాలు నేర్చుకుంటున్న వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు

- నాలుగేళ్ల క్రితమే యోగ శిక్షకులను నియమించిన వైఎస్ జగన్ సర్కారు
- ఆయుష్ వైద్యశాలలకు అనుబంధంగా పనిచేస్తున్న శిక్షకులు
- నేటి యోగాంధ్ర కార్యక్రమాల్లో విస్తృత సేవలు



పాఠశాల విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న యోగ శిక్షకుడు



వేంపాడు ఆయుష్ ఆస్పత్రిలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నక్కపల్లి: కోవిడ్ కాటు వేయడంతో మనుషులు పిట్టల్లా రాలిపోతున్న రోజులవి.. అల్లోపతి వైద్య విధానంలో సరైన చికిత్స లేక అందరి చూపు ఆయుర్వేదం, యునాని, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్యం వైపు మళ్లింది. నాటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2021లో ఆయుష్ వైద్యశాలలను బలోపేతం చేసి, వాటికి అనుబంధంగా యోగ విద్యను ప్రచారంలోకి తేవడానికి యోగ శిక్షకులను నియమించారు. పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రుల పరిధిలో నాటి నుంచి వీరు విశేష సేవలు అందిస్తున్నారు. ఈ శిక్షకుల ద్వారా ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజు గంటపాటు యోగాసనాలు నేర్పించే కార్యక్రమం చేపట్టారు. తదుపరి గ్రామాల్లో ఆసక్తి చూపిన పెద్దలు, పిల్లలు, మహిళలు, యువతీయువకులకు కూడా యోగాపై అవగాహన కల్పించడంతోపాటు, యోగాసనాలు నేర్పించాలని ప్రభుత్వం సూచించింది. ఈ ఆయుర్వేద ఆసుపత్రులకు అనుబంధంగా పనిచేసే యోగా శిక్షకులకు గంటకు రూ.250ల చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. పురుషులయితే నెలకు 32 గంటలు, మహిళలయితే నెలకు 20 గంటలపాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. 2021 నుంచి 2024 వరకు నాలుగేళ్లపాటు ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ప్రతి గ్రామంలోను విద్యార్థులతో కలిపి 150 నుంచి 200 మందికి పైగా యోగా నేర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత యోగా శిక్షకులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది.

యోగాంధ్రలో కీలక పాత్ర

యోగాంధ్ర కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. అన్ని ప్రభుత్వ శాఖలు ప్రైవేట్ యోగా సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నారు. మే 21 నుంచి ప్రపంచ యోగా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. జూన్ 21న విశాఖలో ఐదు లక్షల మందితో 45 నిమిషాల సమయంతో కూడిన ప్రొటోకాల్ యోగాను నిర్ణయించారు. సులభశైలిలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఒకే యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం గ్రామాల్లో యోగా శిక్షకుల ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. వీరంతా యోగా కొనసాగింపులో భాగంగా వారి పరిధిలో ఉన్న గ్రామాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం రోజున విశాఖ బీచ్‌రోడ్డులో యోగాసనాలు వేయాల్సి ఉంటుంది. యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఇతర ఉన్నత స్థాయి అధికారులంతా భాగస్వాములవుతున్నారు. అనకాపల్లి జిల్లాలో మే 27 నుంచి జూన్ 15 వరకు యోగాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు, శిక్షణ నిర్వహిస్తున్నారు. జిల్లాలో నాలుగు టూరిజం ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మే 27న పరవాడ ముత్యాలమ్మపాలెం, జూన్ 2న కేడీపేటలో అల్లూరి సీతారామరాజు పార్క్, 9న రాంబిల్లి తీరప్రాంతం, 15న రేవుపోలవరం సముద్ర తీర ప్రాంతాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇంతటి బాధ్యతలను మోస్తున్న యోగా శిక్షకులు.. తమ వేతనాలు పెంచాలని, సకాలంలో చెల్లించాలని కోరుతున్నారు.

జిల్లాలో 82 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- డీఎఫ్‌వో లక్ష్మణ్



నక్కపల్లి: జిల్లాలో జూన్, జూలై నెలల్లో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 82 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా అటవీ శాఖాధికారి జి.లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో అటవీ భూముల శాతాన్ని పెంచాలన్నదే లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా 90 నర్సరీలు ఏర్పాటు చేసి పంపిణీకి మొక్కలు సిద్ధంగా ఉంచామన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పేపర్ మిల్స్, ఉద్యానవన శాఖ, డ్వామా, అటవీ శాఖల సమన్వయంతో మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సరుగుడికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. 70 లక్షల సరుగుడు, మిగిలిన 12 లక్షలు పలు రకాల జాతులుంటాయన్నారు. పొలాల్లో సరుగుడు పెంపకానికి ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తామన్నారు. నర్సీపట్నం, అనకాపల్లి యలమంచిలి, చోడవరం రేంజ్ కార్యాలయాల పరిధిలో మొక్కల పెంపకంపై పర్యవేక్షణ చేస్తామన్నారు.

బాక్సింగ్ టోర్నమెంట్‌కు జ్యోతి



నర్సీపట్నం: గోవా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జూనియర్ బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు నర్సీపట్నం నింజాస్ అకాడమీ నుంచి బాక్సర్ గండి జ్యోతి 52 కేజీల విభాగంలో పాల్గొంటుందని సీనియర్ కోచ్ యర్రా రాజశేఖర్ తెలిపారు.

న్యూస్‌రీల్

నాతవరం-తాండవ రోడ్డు ఆర్‌అండ్‌బీలో విలీనం

నాతవరం : మండల కేంద్రం నుంచి తాండవ రిజర్వాయరు మధ్య రోడ్డును ప్రభుత్వం అర్‌అండ్‌బీ శాఖలోకి విలీనం చేసిందని ఆర్‌అండ్‌బీ జేఈ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నాతవరం తాండవ రిజర్వాయరు మధ్య సుమారు 7కిలోమీటర్ల రోడ్డు ఇంతవరకు ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉందన్నారు. ఇటీవల ఆ రోడ్డును స్పీకరు అయ్యన్నపాత్రుడు మార్పు చేయాలని ప్రతిపాదనలు చేయడంతో గత నెల 26న తేదీన ప్రభుత్వం అర్‌అండ్‌బీ శాఖకు మార్పు చేసిందన్నారు. ఈరోడ్డును ఇరిగేషన్ శాఖ అధికారులు ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించాల్సిందన్నారు. తమ శాఖకు అప్పగించిన తర్వాతే రోడ్డును ఏవిధంగా అభివృద్ధి చేయాలనేది ప్రణాళిక సిద్ధం చేస్తామని జేఈ నారాయణరెడ్డి తెలిపారు.

బౌద్ధమతం శాంతిని బోధిస్తుంది

బౌద్ధ సన్యాసి గల్కందెగమ ఉదిత థెరో



బౌద్ధ గురువును సత్కరిస్తున్న ఏయూ విద్యా విభాగాధిపతి

విశాఖ విద్య: శ్రీలంకలోని థెరవాద సంప్రదాయానికి చెందిన బౌద్ధ సన్యాసి గల్కందెగమ ఉదిత థెరో ఏయూలోని విద్యా విభాగంలో 'బౌద్ధమతం-శాంతి విద్య'పై గురువారం ప్రసంగించారు. ఆధునిక కాలపు సంఘర్షణలను పరిష్కరించడం, అంతర్గత సామరస్యాన్ని పెంపొందించడంలో నాలుగు గొప్ప సత్యాలు, అష్టాంగ మార్గం ఔచిత్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు బౌద్ధ బోధనల ద్వారా శాంతి యొక్క ఆధ్యాత్మిక, తాత్విక కోణాలతో నిమగ్నమయ్యే అరుదైన అవకాశాన్ని అందించింది. విభాగాధిపతి ప్రొఫెసర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ, యువత అభివృద్ధిలో శాంతి విద్య యొక్క పరివర్తనాత్మక పాత్రను వివరించారు.

వాడపల్లికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

డాబాగార్డెన్స్: తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ప్రతి శనివారం ఉదయం 4 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి విశాఖ నుంచి వాడపల్లికి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటలకు వాడపల్లిలో బస్సు బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందన్నారు. ప్రయాణ చార్జీ(ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.1000గా నిర్ణయించినట్లు తెలిపారు. టికెట్లను https://www.apsrtconline.inలో రిజర్వ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731లో సంప్రదించవచ్చు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను తాత్కాలిక ప్రాతిపదికన జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖపట్నం-పారాదీప్(22810) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8, 15వ తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు, పారాదీప్-విశాఖపట్నం(22809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16వ తేదీల్లో రెండు స్లీపర్ క్లాస్ కోచ్‌లు, విశాఖపట్నం-అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 10వ తేదీన ఒక స్లీపర్ క్లాస్ కోచ్, అమృత్‌సర్-విశాఖపట్నం(22808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14వ తేదీన ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రిటైల్ ట్రైనీ, బీమా ఏజెంట్ కోర్సులకు దరఖాస్తులు

మద్దిలపాలెం (విశాఖ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ మోడల్ కెరీర్ సెంటర్(ఎంసీసీ) ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా ఏయూలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలో ఉచితంగా రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఇన్సూరెన్స్ ఏజెంట్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి, అర్హత గల యువత ఏయూలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్స్ పూర్తయిన తర్వాత నైపుణ్యం ఆధారంగా ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పించనున్నారు. కోర్స్‌లో కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

20 ఏళ్లకు పైబడి ఒకేచోట..

- ఫార్మసిస్టులు, లేబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంల కష్టాలు
- కాంట్రాక్టు ఉద్యోగులుగా ఇన్నాళ్లూ బదిలీకి అవకాశం లేదు
- ఏడాది క్రితం రెగ్యులరైజ్ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఈసారైనా బదిలీకి చాన్స్ ఇవ్వాలని కోరుతున్న వైద్య సిబ్బంది
- క్రమబద్ధీకరించి సంవత్సరమే అయిందని నిరాకరిస్తున్న ప్రస్తుత సర్కారు





నాతవరం: వైద్య ఆరోగ్య శాఖలో కొంతమంది సిబ్బంది ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2001-02 సంవత్సరంలో ఫార్మసిస్టులు, లేబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలను నియమించారు. ఆనాటి నుంచి 2024 వరకు వీరు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరిని రెగ్యులర్ చేశారు. వీరు రెగ్యులరైజ్ అయి ఏడాది అవుతున్నా ప్రభుత్వం ప్రస్తుతం తలపెట్టిన సాధారణ బదిలీల్లో అవకాశం కల్పించడంలేదు. కాంట్రాక్టు ఉద్యోగులు కావడంతో గతంలో బదిలీలకు చాన్స్ దక్కలేదు. ఇప్పుడు రెగ్యులర్ అయి ఏడాది మాత్రమే అయిందంటూ అన్యాయం చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పీహెచ్‌సీలలో ఫార్మసిస్టులు, లేబ్ టెక్నీషియన్లు, ఏఎన్‌ఎంలు 65మంది వరకు 20 ఏళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్నారు. వీరు బదిలీల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నాతవరం పీహెచ్‌సీలో ఫార్మసిస్టు వెంకటరావు 23 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇదే మండలం గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎం 22 ఏళ్లుగా, పాయకరావుపేట మండలం గొడిచెర్ల పీహెచ్‌సీలో ఫార్మసిస్టు 24 ఏళ్లుగా, రాంబిల్లి మండలంలోని పీహెచ్‌సీలలో లేబ్ టెక్నీషియన్లు 22 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారు. ఇన్నాళ్లూ రెగ్యులర్ కాలేదని బదిలీకి చాన్స్ ఇవ్వలేదని, కనీసం ఇప్పుడైనా ప్రత్యేకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని వారు కోరుతున్నారు. లేకపోతే ఉద్యోగంలో చేరిన స్థానంలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తుందన్నారు.

పాయిజన్ కంటే పాలిథిన్ ప్రమాదం

- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్



పెనుగొల్లులో వరహానది గట్టుపై కొబ్బరి మొక్క నాటుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నక్కపల్లి: పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్కపల్లి మండలం పెదబోదిగల్లంలో ఏపీఐఐసీ నిర్వాసితుల కోసం ఎంపిక చేసిన పునరావాస కాలనీలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిథిన్ అనేది పాయిజన్ కంటే ప్రమాదమన్నారు. అందుకే దీని వాడకాన్ని ప్రభుత్వాలు నిషేధిస్తున్నాయన్నారు. మార్కెట్లకు వెళ్లినపుడు చేతి సంచి లేదా నూలుతో తయారు చేసిన సంచులను తీసుకెళ్లాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం విరివిగా మొక్కలు పెంచాలన్నారు. పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజ్, డీఎఫ్‌వో లక్ష్మణ్, ఆర్‌డీవో వి.వి.రమణ, ఎస్‌డీఎఫ్‌వో సునీల్‌కుమార్, రేంజ్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ఎఫ్‌డీవో పైడిరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, సర్పంచ్ మున్నీసా పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరగాలి

ఎస్.రాయవరం: ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఆయిల్‌పామ్ డ్రైవ్‌లో భాగంగా వమ్మవరం గ్రామంలో గురువారం కలెక్టర్ పామాయిల్ మొక్కలు నాటారు. పెనుగొల్లు గ్రామంలో వరహానది గట్టుపై కొబ్బరి మొక్కలు, అందులో అంతరపంటగా సాగు చేసేందుకు కోకో మొక్కలు నాటారు. గ్రామంలో ఓ సీనియర్ రైతును సత్కరించి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసిన సేంద్రియ ఎరువు కిట్లను రైతులకు పంపిణీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రభాకర్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ అధికారి పట్టాభిరామిరెడ్డి, జిల్లా అధికారి టి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి సౌజన్య, తహసీల్దార్ జె.రమేష్ బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, పెనుగొల్లు సర్పంచ్ ఉద్దండం నాగశ్రీదేవి, వైఎస్సార్ సీపి నాయకులు ఉద్దండం సూర్యనారాయణ పాల్గొన్నారు.

పెరటిలోనే ఔషధ మొక్కలు

- చక్కని ఆరోగ్యానికి ఎంతో మేలు: డాక్టర్ లావణ్య



డాక్టర్ లావణ్యను సత్కరిస్తున్న జిల్లా సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం సభ్యులు

అనకాపల్లి: రాణపాల, తులసి, అలివెరా, నేల ఉసిరి వంటి ఔషధ మొక్కలను ప్రతి ఇంటి పెరడులో పెంచుకోవచ్చని ఆయుష్మాన్ భారత్ వైద్యురాలు డాక్టర్ కె.లావణ్య చెప్పారు. వి.వి.రమణ రైతు భారతి హాల్లో గురువారం జిల్లా గ్రామీణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఔషధ మొక్కలు అందుబాటులో ఉంటే మనం ఆరోగ్యంగా ఉన్నట్టేనని చెప్పారు. పరిశుభ్రమైన గాలిని పీల్చాలంటే మొక్కల ద్వారానే సాధ్యమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇళ్ల వద్ద మొక్కలను పెంచడం లేదని, వాతావరణంలో అనేక మార్పులు సంభవించి, వివిధ వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కొత్తగా గృహాలు నిర్మించే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రాంతీయ పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ డాక్టర్ ఎస్.నూకరాజు మాట్లాడారు. సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, సభ్యులు కాండ్రేగుల విశ్వేశ్వరరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



చోడవరం: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న ఫ్యామిలీ కోర్టు అదనపు న్యాయమూర్తి రాజారావు, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ



అనకాపల్లి టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న పదో అదనపు జిల్లా జడ్జి నరేష్

ఏపీఐఐసీ భూముల పరిశీలన

- వివరాలు తెలుసుకున్న పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్
- ఉన్నతాధికారి పర్యటన గోప్యంగా ఉంచడంపై నిర్వాసితుల్లో అసంతృప్తి



ఏపీఐఐసీ భూములు పరిశీలిస్తున్న కార్యదర్శి యువరాజ్

నక్కపల్లి: మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో జరుగుతున్న పనులను రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ గురువారం పరిశీలించారు. వేంపాడు, చందనాడ, డీఎల్ పురం, అమలాపురం, రాజయ్యపేటలలో 2000 ఎకరాలు బల్క్ డ్రగ్ పార్క్‌కు, 2500 ఎకరాలు ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. రూ.1100 కోట్ల వ్యయంతో ఈ భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు ఎంతవరకు వచ్చాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలు తెలుసుకునేందుకు కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి యువరాజ్ ఈ ప్రాంతాల్లో పర్యటించినట్లు అధికారులు తెలిపారు. ఏ గ్రామంలో ఎంత భూమి సేకరించారు. జిరాయితీ ఎంత, డీ ఫారం ఎంత, ప్రభుత్వ భూమి ఎంత అనే వివరాలు అధికారులు వివరించారు. గతంలో ఆయన ఉమ్మడి విశాఖ కలెక్టర్‌గా ఉన్న సమయంలోనే భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులు వంటి ప్రక్రియ జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ పునరావాస కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసి లేఅవుట్ సిద్ధం చేసి నిర్వాసితులకు అప్పగించాలని ఆదేశిస్తున్నట్లు చెప్పారు. ఆర్డీవో రమణ, ఎస్‌డీసీ అనిత, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

అంత గోప్యత ఎందుకో?

పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ పర్యటనపై రైతులు, నిర్వాసితులకు కనీస సమాచారం లేదు. పూర్తిగా అధికారిక పర్యటన అయినప్పటికీ స్థానిక అధికారులు గోప్యంగా ఉంచారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని గతంలో టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పిందని రైతులు, నిర్వాసితులు ఆగ్రహంతో ఉన్నారు. బాధిత రైతులు ఎక్కడ ఆయన కాన్వాయ్‌ను అడ్డుకుని తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నిస్తారనే భయంతోనే పర్యటనను గోప్యంగా ఉంచినట్టు తెలుస్తోంది. సమస్యలను కార్యదర్శి దృష్టికి తీసుకు వచ్చేవారమని, ఎవరికీ కనీస సమాచారం లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తెలిపారు.

జూలై 9, 10 తేదీల్లో గిరి ప్రదక్షిణ

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

విశాఖ సిటీ: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి గిరి ప్రదక్షిణ జూలై 9, 10 తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. భక్తులు జాతీయ రహదారిని దాటే చోట తాత్కాలిక ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్, సీపీ శంఖబ్రత బాగ్చి అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సమన్వయం చేసుకొని చర్యలు చేపట్టాలని చెప్పారు. తొలి పావంచా వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు పోలీస్ బందోబస్తు, పోలీస్ శిబిరాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాల వద్ద గట్టి బందోబస్తు కల్పించాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, ముందుగానే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంబులెన్సులు, వైద్య శిబిరాలు సిద్ధం చేయాలని వైద్యాధికారులకు సూచించారు.

ఉదయం నుంచి దర్శనాలు

ప్రధాన అర్చకుడు వైదిక కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. జూలై 9వ తేదీ ఉదయం నుంచి దర్శనాలు మొదలవుతాయని, ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. తొలి పావంచా వద్ద కొబ్బరి కాయ కొట్టడం ద్వారా 32 కి.మీ మేర గిరి ప్రదక్షిణ మొదలవుతుందని పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగుతాయని, ఆ రోజే స్వామికి నాలుగో విడత చందనోత్సవం జరుగుతుందని తెలిపారు.

కారుకు నిప్పు అంటించిన
దుండగులు



కారు నుంచి ఎగసి పడుతున్న మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి శారదనగర్‌లో నివాసం ఉంటున్న జర్నలిస్టు ఈశ్వరరావు కారుకు గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి దుండగులు ఈ సంఘటనకు పాల్పడ్డారు. తను నివాసం ఉంటున్న ఇంటికి ఎదురుగా ఉన్న రోడ్డుపై పార్కింగ్ చేశాడు. పెట్రోల్ పోసి కారుకు నిప్పు అంటించారు. మంటలు ఒక్కసారిగా ఎగిసి పడడంతో ఈశ్వరరావు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేసి వెనుతిరిగారు. అందరూ వెళ్లిపోగా మరలా దుండగులు కారుకు నిప్పు అంటించారు. దీంతో కారు మొత్తం దగ్ధమైంది. బాధితుడు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు మాడుగులలో మెగా ఉద్యోగ మేళా

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు

అనకాపల్లి : మాడుగుల నియోజకవర్గం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు గురువారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, పదోతరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మెగా ఉద్యోగ మేళాకు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 8106327482ను సంప్రదించాలని ఆయన కోరారు.

పరారైన లారీని పట్టుకున్న పోలీసులు

- సీసీ కెమెరాల ఫుటేజ ఆధారంగా దర్యాప్తు
- లారీ డ్రైవర్ అరెస్ట్

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతికి కారకుడైన లారీ డ్రైవర్‌ని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు ఈ విషయాన్ని గురువారం తెలిపారు. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి కలగా దుర్గినాయుడు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొని వెళ్లిపోవడంతో బుధవారం రాత్రి అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. పరారైన లారీని పట్టుకోవడం కోసం తాను, మరో ఎస్ఐ మనోజ్‌కుమార్ రెండు వేర్వేరు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశామన్నారు. జాతీయ రహదారిపై సీసీ కెమెరాల ఫుటేజీల సహాయంతో పాయకరావుపేట మండలం నామవరం టోల్ ప్లాజా వద్ద లారీని పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. దాని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

దిక్కులేని జీవీఎంసీ

- కమిషనర్ లేని పాలన.. విశాఖకు తీరని వేదన
- ఫైళ్లు పేరుకుపోతున్నాయి.. పనులు సాగడం లేదు
- కూటమి నిర్లక్ష్యంపై నగర ప్రజల ఆగ్రహం



దాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా.. ఐదు నెలలుగా రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో నగర పాలన పూర్తిగా గాడితప్పింది. రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌కు నెలల తరబడి కీలక అధికారిని నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు పూర్తిగా ఆగిపోయాయి. అధికారులలో జవాబుదారీతనం కొరవడింది. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్తంభించిన పాలన

శాశ్వత కమిషనర్ లేకపోవడంతో జీవీఎంసీలో పర్యవేక్షణ కొరవడింది. పాలన స్తంభించిపోయింది. సుమారు 20 లక్షల జనాభా, 98 వార్డులున్న జీవీఎంసీ బాధ్యతలను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు అప్పగించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్న ఆరోపణలున్నాయి. ఓ వైపు కలెక్టరేట్ వ్యవహారాలు.. మరోవైపు జీవీఎంసీ బాధ్యతలతో ఆయన సతమతమవుతున్నారు. దీంతో క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడి, ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కింది స్థాయి అధికారులు సైతం తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తుండడంతో ఫైళ్లు పేరుకుపోతున్నాయి. పనులు ముందుకు సాగడం లేదు. నూతన మేయర్ సైతం సమీక్షలకే పరిమితమయ్యారని, అధికారులను జవాబుదారీ చేసే స్థాయిలో చర్యలు కొరవడ్డాయని విపక్ష కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు.

అటకెక్కిన అభివృద్ధి, పారిశుధ్యం

కమిషనర్ లేని లోటు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత కమిషనర్ హయాంలో మురికివాడల అభివృద్ధి, రూ.500 కోట్లతో తాగునీటి పైపులైన్ల మంజూరు, గుర్తించిన 1,150 ఖాళీ స్థలాల్లో పార్కుల అభివృద్ధి వంటి కీలక ప్రతిపాదనలు చేశారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో చేపట్టాల్సిన పనులన్నీ ప్రస్తుతం నిలిచిపోయాయి. ఉన్నతాధికారి పర్యవేక్షణ కొరవడటంతో పారిశుధ్య నిర్వహణ దయనీయంగా మారింది. ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. మురికివాడలు, కొండవాలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. దోమలు విజృంభించి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ప్రసాద్‌గార్డెన్స్, వెలంపేట, పండావీధి, అల్లిపురం, కొబ్బరితోట, పద్మానగర్, చిలకపేట, జాలారిపేట, రంగిరీజువీధి, చెంగల్రావుపేట, జబ్బరతోట, పెయిందొరపేట, కోటవీధి, ఫెర్రీరోడ్డు, తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆరిలోవ, డెయిరీఫాం ఏరియా, రామ్‌నగర్‌తో పాటు పలు మురికివాడ ప్రాంతాలు, ఉత్తర నియోజకవర్గ పరిధిలో పలు కొండవాలు ప్రాంతాలు, మురికివాడ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి.

ప్లాస్టిక్ నియంత్రణ ఎక్కడ?

నగరంలో యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది. గత మేయర్, కమిషనర్ హయాంలో చేపట్టిన ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడానికి చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, డోర్-టు-డోర్ ప్రచారాలు, నియంత్రణ కమిటీలు అన్నీ అటకెక్కాయి. దీంతో నగరంలో మళ్లీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ దర్శనమిస్తోంది.

జీవీఎంసీని గాడిలో పెట్టేదెవరు?



జీవీఎంసీకి శాశ్వత కమిషనర్ లేకపోవడం నగర పాలనపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. అభివృద్ధి కుంటుపడింది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఫైళ్లు కదలడం లేదు. రాష్ట్రంలోనే అతి పెద్ద కార్పొరేషన్‌కు కమిషనర్‌ను నియమించకుండా కూటమి ప్రభుత్వం ఆడుతున్న నాటకమేంటో? నగర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కమిషనర్‌ను నియమించడం అత్యవసరం.

– బానాల శ్రీనివాసరావు, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్

ప్రజాగ్రహం, ప్రతిపక్షాల ఆందోళన

జీవీఎంసీకి కమిషనర్‌ను నియమించడంలో ప్రభుత్వ వైఫల్యంపై నగర ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్‌నే నియమించలేని ప్రభుత్వం.. రాష్ట్రాన్ని ఏం పాలిస్తుంది? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. ఐదు నెలలుగా కమిషనర్ లేకపోవడం జీవీఎంసీ చరిత్రలోనే ఇది మొదటిసారని, ఇది కూటమి ప్రభుత్వ ఘనకార్యమని విపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. తక్షణమే సమర్థవంతమైన ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించి, నగర పాలనను గాడిలో పెట్టాలని సీపీఎం, సీపీఐ ఫ్లోర్ లీడర్లు గతంలోనే నిరసన వ్యక్తం చేశారు. సమర్థంగా పనిచేస్తున్న కమిషనర్‌ను అర్ధాంతరంగా బదిలీ చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపించారు. స్వప్రయోజనాల కోసం విశాఖను దిక్కులేని నగరంగా మార్చివేశారని, ప్రజల సమస్యలు పరిష్కరించే నాథుడే లేడని మండిపడ్డారు.

రైతులను మోసగించిన ఎంపీ రమేష్

- కూటమి పాలనలో దయనీయంగా చెరకు రైతులు, కార్మికుల పరిస్థితి
- గత ప్రభుత్వ హయాంలో రూ.89 కోట్ల నిధులు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న ధ్వజం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

దేవరాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సహా కూటమి నాయకులు ఘోరంగా మోసం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో గురువారం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కాగా ఒకప్పుడు సహకార రంగంలో రోల్‌మోడల్‌గా నిలిచి, నేడు శిథిలావస్థకు చేరుకున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని పట్టించుకోక పోవడం అత్యంత దుర్మార్గపు చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార రంగంలో నడుస్తున్న ఫ్యాక్టరీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం రైతులను మోసగించడమేనన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాలలో అత్యధికంగా వరి, చెరకు పండిస్తుండగా కూటమి నాయకులు మాత్రం డిస్టలరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రైతులు, కార్మికులను దృష్టిలో ఉంచుకొని ఐదేళ్లలో రూ.89 కోట్లు మంజూరు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం 2023-2024 సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు ఇంకా చెల్లించాల్సిన రూ.150 అందరికీ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. 2024-25 సీజన్‌లో లక్షా 7వేల టన్నుల చెరకు క్రషింగ్ జరపగా, దీనిలో జనవరి 21 నుంచి ఫిబ్రవరి 4 వరకు మాత్రమే తొలి దఫా పేమెంట్‌గా టన్నుకు రూ.3వేలు చొప్పున చెల్లించారన్నారు. ఆ తర్వాత ఏప్రిల్ 10 వరకు క్రషింగ్ జరిగినా రైతులకు ఇంకా పేమెంట్లు ఇవ్వలేదన్నారు. ఫ్యాక్టరీ భవిష్యత్ అంధకారంగా ఉందని, నెలల తరబడి కార్మికులకు జీతాలు, రైతులకు పేమెంట్లు ఇవ్వకపోవడంతో దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ చెరకు రైతులను దారుణంగా మోసం చేసిన ఎంపీ రమేష్, కూటమి నాయకులు నిస్సిగ్గుగా ప్రజల్లో తిరుగుతున్నారని ఘాటుగా విమర్శించారు. రైతులను మోసగించిన నాయకులకు పుట్టగతులుండవని హెచ్చరించారు.

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య



గుండే అభిషేక్ కుమార్

అనకాపల్లి టౌన్: తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణ పరిధిలో జరిగింది. పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయరామరాజుపేట శ్రీరామ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న గుండే అభిషేక్ కుమార్ (17)బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఫ్రెండ్స్‌తో వెళతానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి రావడంతో అతని తల్లి ఎస్.కె షకీనా ఎందుకు ఆలస్యంగా వచ్చావని మందలించింది. దీంతో మనస్థాపం చెంది గదిలో గడియపెట్టుకొని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని చనిపోయాడు. కొద్దిసేపటి తరువాత గమనించిన తల్లి చుట్టుపక్కల వాళ్లని పిలిచి తలుపులు బద్దలు కొట్టి అభిషేక్‌ను కిందికి దించి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అభిషేక్ ఇటీవలే ఇంటర్ పరీక్షలు రాశాడు. ఘటనపై మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యోగాతో ఆరోగ్యం, దీర్ఘ కాలిక వ్యాధుల నివారణ

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీ



యోగాసనాలు వేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో బాలాజీ, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, వైద్య సిబ్బంది

అనకాపల్లి: నిత్య జీవితంలో యోగా చేయడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని, వివిధ రకాలైన వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చని, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా ఆయుష్ మాన్ భారత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం విశాఖలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలగాలంటే ప్రతి ఒక్కరూ ఉదయం లేదా సాయంత్రం సమయంలో రోజుకు రెండు గంటలు యోగా చేయాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల తరువాత మానవ జీవితంలో యోగా ప్రాముఖ్యత కలిగిందని, ప్రాచీన కాలం నుంచి యోగాకు ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నప్పటికీ కరోనా తరువాత దీనిపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. చిన్ని పిల్లల నుంచి వృద్ధుల వరకూ వయస్సును బట్టి యోగాసనాలు వారివారి స్వగృహాల్లోనే చేసుకోవచ్చని పేర్కొన్నారు. అంతకుముందు యోగా గురువుల బి.అప్పారావు, దొరం నాయుడు, మంగియ్య పర్యవేక్షణలో యోగాసనలు చేశారు. వైద్య సిబ్బంది ఎన్టీఆర్ ఆస్పత్రి నుంచి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ ఎం. శ్రీనివాసరావు, జిల్లా ఆయుష్‌శాఖ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి శ్రావ్య శ్రీ, జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- పలుచోట్ల మొక్కలు నాటిన అధికారులు



గవరపాలెం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు



చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, ఎమ్మెల్యే రాజు

చోడవరం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అదనపు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి పి.రాజారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చోడవరం కోర్టుల ఆవరణలో మొక్కలు నాటారు. అదనపు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి పి.రాజారావు , ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలరాజు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు చీపురుపల్లి సూర్యానారాయణ, ఎస్.భవానీశంకరరావు, వి.వెంకట్రావు, పైడిరాజు, వారాధి రాజు, చందు, పీవీ రమణమూర్తి పాల్గొన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలు నాటారు. ఎండీ సన్యాసినాయుడు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆవరణతోపాటు చెరకు కాటాల వద్ద, పలు పాఠశాలల్లోనూ, గోవాడ, అంబేరుపురం గ్రామాల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సీసీ ప్రసాద్, సీఏఓ ఎస్ఎల్ సత్యనారాయణ, సీఈ పి.ప్రసాదరావు, సీడీఓ రామం, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, పీఏ రవి, యూనియన్ నాయకులు భాస్కరరావు, రామునాయుడు పాల్గొన్నారు. చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ కె. మన్మథరావు, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి పాల్గొని మొక్కలు నాటారు. పాస్టిక్ వస్తువులు పూర్తిగా వాడకం మానేసి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించాలని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, ఎమ్మెల్యే రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తమ్, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, ఈఓపీఆర్‌డి మహేష్, పంచాయతీ ఈఓ నారాయణరావు, పాల్గొన్నారు.

మానవ మనుగడకు చెట్లు కీలకం

అనకాపల్లి టౌన్ : మానవ మనుగడలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పుట్టిన రోజుల సందర్భంగా మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అనకాపల్లి పదో అదనపు జిల్లా జడ్జి నరేష్ పాల్గొని మొక్కలను నాటారు.

అంగరంగ వైభవంగా రామలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మాడుగుల : మండలంలో సత్యవరం గ్రామంలో గురువారం అంగరంగ వైభవంగా రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన స్వామివారి ప్రతిష్ఠ కార్యక్రమం గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా రామలింగేశ్వర, నందీశ్వరుడు, వినాయక, పార్వతీదేవిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిపారు. భక్తులంతా బూరెలు, పండ్లు, పుష్పాలు, నవధాన్యాలు తీసుకొచ్చి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనతంరం స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన జరిపారు. ఉత్సవాల సందర్భంగా మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాగశాలలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో గృహస్తు దంపతులు పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ పాల్గొన్నారు.

ఏవోబీలోనూ సుధాకర్ కీలకపాత్ర

- మావోయిస్టు ఉద్యమ బలోపేతంలో తనదైన ముద్ర
- ఏజెన్సీలో ఘటనలకు ఆయనే వ్యూహం రూపొందించే వారని ప్రచారం



బంధువులతో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ (ఫైల్)

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ అలియాస్ లక్ష్మీనరసింహచలం ఏవోబీలో ఉద్యమ బలోపేతంలో కీలకపాత్ర పోషించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ అడవుల్లో గురువారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతిచెందారు. ఈ ప్రాంత ఉద్యమంతో ఆయనకు బలమైన సంబంధాలు ఉన్నాయి. నల్లమల అడవుల నుంచి ఏవోబీలోకి ప్రవేశించిన ఆయన ఏవోబీ కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మావోయిస్టు పార్టీ చేపట్టిన శాంతి చర్చల్లోను ఆయన పాల్గొన్నారు. ఒడిశాలోని సుంకి-సాలూరు ఏరియా కమిటీలో సుదీర్ఘకాలం మావోయిస్టు ఉద్యమాన్ని నడిపారు. 2006లో అప్పటి విజయనగరం జిల్లా మక్కువ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రసమంతవలస అడవుల్లో సుధాకర్ పోలీసుల నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. అడవిలో సురక్షిత ప్రాంతంలో ఉన్నారనే సమాచారంతో అప్పటి పోలీసు పార్టీలు ఆయనను సజీవంగా పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటినుంచి ఆయన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుగా మారారు. ఏవోబీ పరిధి రాష్ట్రాల సరిహద్దుల్లో జరిగే మావోయిస్టు ఉద్యమ కార్యక్రమాలకు ఈయనే వ్యూహం రూపొందించేవారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయనను కోల్పోవడం దండకారణ్యంలో మావోయిస్టు పార్టీకి తీరని నష్టంగానే చెప్పవచ్చు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మాకవరపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం.. రోలుగుంట మండలం రత్నంపేటకు చెందిన దువ్వాడ శ్రీను (50) మండలంలోని తామరంలో నివాసం ఉంటున్నాడు. అతడికి మతిస్థిమితం సరిగా లేక బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. పెద్దమిల్లు జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మరణించాడు. ఈ ఘటనపై భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు గురువారం తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

క్లుప్తంగా

సమీకృత మిశ్రమ దాణా పంపిణీ

కశింకోట: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సోమవరం గ్రామంలో రాయితీపై అందించిన సమీకృత మిశ్రమ దాణాను పాడి రైతులకు గురువారం పంపిణీ చేశారు. సుమారు 1,500 కిలోల దాణాను అందజేశారు. పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బి. రామ్మోహనరావు, సహాయ సంచాలకురాలు బి. సౌజన్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం


ఉగ్గినపాలెం వద్ద కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం వద్ద మేకుల తయారీ పరిశ్రమలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గురువారం కాలిపోయింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి అగ్ని కీలలు వ్యాపించాయి. జాతీయ రహదారి పక్కన ప్రమాదం జరగడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. హై ఓల్టేజీ రావడం వల్ల ఇది కాలిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు.

వెలవెలబోయిన వారపు సంత


కశింకోటలో వెలవెలబోయిన వారపు సంత

కశింకోట: స్థానిక వారపు సంత గురువారం వెలవెలబోయింది. సూర్య తాపంతో ఉదయం 11 గంటల వరకు సంతకు ప్రజలు రాలేదు. చిల్లర వ్యాపారులు ఎండ వేడితో తమ దుకాణాలను విడిచిపెట్టి నీడ పట్టుకు చేరుకున్నారు. కొందరు ఎండలోనే దుకాణాలు గొడుగులు వేసుకొని నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ఒకరొకరుగా తరలి వచ్చారు. దీంతో ముమ్మరంగా అమ్మకాలు సాగాయి.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పన్నపాలేనికి చెందిన బాలుడి(12) ఆచూకీ లభ్యమైనట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి నూడుల్స్ కోసం వెళ్లిన ఆ బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నగరంలో బాలుడి ఆచూకీని గురువారం కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 118 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,620	4,990
రెండో రకం	3,700	4,200
మూడో రకం	3,000	3,640

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
గ్యాంబ్లర్స్	:సత్యనారాయణస్క్రీన్-1
007	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
థగ్ లైఫ్	:షిర్డీసాయి
రాజావారు	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
పాడేరు 12వ మైలు	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-24 యూనిట్లు, బీ పాజిటివ్-12, ఓ పాజిటివ్-35, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 329 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 257 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సమస్యల తిష్ట
- క్రీడాకారిణుల భవనంలో అసాంఘిక కార్యకలాపాలు
- ప్రారంభానికి నోచుకోని జిమ్
- వాకర్స్, క్రీడాకారులకు తీవ్ర ఇబ్బందులు


వైఎస్సార్‌సీపీ పాలనలో క్రీడాకారిణులకు నిర్మించిన భవనం

అనకాపల్లి: ఎన్టీఆర్ క్రీడా మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించే ఇక్కడ మైదానంలో క్రీడాకారులకు కనీస వసతులు లేవు. అనకాపల్లి జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత ఈ మైదానికి మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవం, ఆగస్టు 15న పంద్రాగస్టు వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన మైదానం అభివృద్ధికి నోచుకోవడం లేదు.

మందుబాబులకు అడ్డాగా మహిళా క్రీడా సాధికార భవనం...


వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎంపీ బీవీ సత్యవతి రూ.75 లక్షలతో క్రీడా మైదానంలో క్రీడాకారిణులకు నూతన వసతి భవనాన్ని నిర్మించారు. ఇక్కడ క్రీడా పోటీలు నిర్వహించే సమయంలో వారంతా ప్రభుత్వ పాఠశాలలోను, లాడ్జీల్లో బస చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్య పరిష్కారానికి మహిళా క్రీడా సాధికార భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇది మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రిళ్లు మద్యం తాగి సీసాలు అక్కడే పారేస్తున్నారు.

మరుగుదొడ్లు లేవు


2014-19 టీడీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ క్రీడాకారులు, వాకర్స్‌ను దృష్టిలో పెట్టుకుని మరుగుదొడ్డి ఏర్పాటుకు రూ.2 లక్షలు కేటాయించారు. దీన్ని కాంట్రాక్టర్ అసంపూర్తిగా నిర్మించి వదిలేశాడు. అప్పటి నుంచి ఇది అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మల, మూత్ర విసర్జనకు క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మరుగుదొడ్డిని పూర్తిస్థాయిలో నిర్మించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

జిమ్ ప్రారంభం ఎప్పుడో....

వైఎస్సార్‌సీపీ పాలనలో క్రీడా మైదానంలో క్రీడాకారులకు జిమ్‌ను ఏర్పాటు చేయాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు జీవీఎంసీకి కోరారు. ఆ మేరకు రూ.10లక్షలతో నూతనంగా జిమ్‌ను నిర్మించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో జిమ్ ప్రారంభించలేదు. అప్పటి నుంచి ఏడాదిగా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. జిమ్‌ను ఆనుకుని జీవీఎంసీ దుకాణాలు ఉన్నాయి. ఒకషాప్ యాజమాని దుకాణం వెనుక భాగాన గోడను తొలగించి జిమ్ ప్రాంత స్థలాన్ని ఆక్రమించాడు. జిమ్‌ను త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.


క్రీడా మైదానంలో ప్రారంభానికి నోచుకోని జిమ్


వర్షపునీరుతో బురదగా క్రీడా మైదానం


క్రీడాకారిణుల నూతన భవనంలో మెట్లపై మద్యం సీసాలు

క్రీడా మైదానంలో మద్యం సీసాలు, చెత్తా చెదారం...

నిత్యం ఉదయం, సాయంత్రం సమయంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తారు. ఆ సమయంలో ఇక్కడ మద్యం సీసాలు, చెత్తా చెదారంతో వాకర్స్ అనేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న క్రీడా మైదానానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతోపాటు వివిధ వర్గాల ప్రజలు వాకింగ్ వస్తున్నారు. వీరికి మరుగుదొడ్డితోపాటు కనీసం తాగు నీటి సౌకర్యం లేకుండా పోయింది. ఉదయం, సాయంత్రం సమయంలో క్రీడాకారులు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

రక్షణ గోడ కూలి...

న్యూకాలనీ రహదారి వైపు ఎనిమిది మాసాల క్రితం క్రీడా మైదానం రక్షణ గోడ వర్షానికి నాని పోయి కూలిపోయింది. అప్పటి నుంచి కొంతమంది జులాయిలు రాత్రిళ్లు ఇటువైపు నుంచి లోపలకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారు. దీనిపై వాకర్స్, క్రీడాకారులు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు.

వాకర్స్‌కు సౌకర్యాలు కల్పించాలి



15 సంవత్సరాలుగా క్రీడా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను. వర్షం పడే సమయంలో నీరు బయటకు పోయే మార్గం లేదు. దాంతో రెండు మూడు రోజులు వాకింగ్‌కు ఇబ్బందిగా ఉంటుంది. తాగునీటి సౌకర్యం కల్పించాలి. కొత్తగా నిర్మించిన జిమ్‌ను వాకర్స్, క్రీడాకరులకు అందుబాటులోకి తేవాలి. మద్యం ఖాళీ సీసాలు పగలుగొట్టి వాకింగ్ ట్రాక్‌పై వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం.

–పి.రామకృష్ణ, క్రీడా మైదానం వాకర్స్, అనకాపల్లి

రక్షణ గోడ నిర్మించాలి



వర్షాలకు క్రీడా మైదానంలో రక్షణ గోడ పడిపోయింది. దాంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. క్రీడాకారిణుల కోసం నిర్మించి భవనం నిరుపయోగంగా ఉంది. చెత్తా చెదారం పేరుకుపోయి విషసర్పాల బెడద ఉంది. మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళలో క్రీడా మైదానంలో క్రికెట్, వివిధ ఆటలు ఆడుతారు. ఆర్మీ, నేవీ, పోలీస్ శాఖ ఉద్యోగాలకు ప్రయత్నించే నిరుద్యోగులు ఇక్కడ రన్నింగ్ చేస్తుంటారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన మైదానాన్ని అభివృద్ధి చేయాలి.

– పి.కల్యాణ్‌చక్రవర్తి, వ్యాయామ క్రీడాకారుడు, అనకాపల్లి


అప్పటి టీడీపీ పాలనలో అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్డి


క్రీడా మైదానంలో పచ్చిమెక్కలు

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు పార్టీ అనుబంధ విభాగాలకు సంబంధించి అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా జాజుల రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎ.వి.రత్నకుమారి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఎం.రమణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్స్ అధ్యక్షులుగా విల్లూరి శేఖర్, పెట్ల నాగేశ్వరరావు, పాచండి పద్మ, మైనార్టీ సెల్ అధ్యక్షునిగా షేక్ రెహమాన్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షునిగా కె.ఎస్.జెమ్స్, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా రాయి రాజు, పంచాయతీ రాజ్ అధ్యక్షునిగా ఎస్.సత్యనారాయణ, వలంటీర్స్ వింగ్ అధ్యక్షురాలిగా కోన ఉమా, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా తట్టా పెంటయ్యనాయుడు, వాణిజ్య విభాగం అధ్యక్షునిగా శ్రీధరాల మనోజ్‌కుమార్, వీవర్స్ వింగ్ అధ్యక్షునిగా ఎ.నూక సంతోష్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షునిగా మారిశెట్టి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా కె.దుర్గా కుమారి, లీగల్ సెల్ అధ్యక్షునిగా కోరిబిల్లి యుగంధర్, సాంస్కృతి విభాగం అధ్యక్షునిగా వడ్డాది అశోక్‌కుమార్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షునిగా కాండ్రేగుల శ్యామ్, ఐటీ వింగ్ అధ్యక్షునిగా సూరిశెట్టి రవి, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షునిగా కె.శంకర్, బూత్ కమిటీస్ వింగ్ అధ్యక్షునిగా గైపూర్ రాజు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా నక్కా రాజుప్రభాకర్ నియమితులయ్యారు.

26న బార్ అసోసియేషన్ ఎన్నిక


ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి బుద్ధ సాయి ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19, 20 తేదీల్లో నామినేషన్‌ల స్వీకరణ, 21న స్క్రూటినీ చేస్తామన్నారు. అభ్యర్థుల దరఖాస్తుల ఉపసంహరణ పూర్తయ్యాక 23తో ప్రక్రియ ముగుస్తుందన్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ కార్యదర్శి తదితర పదవులకు పోటీపడే వారు దరఖాస్తులను నిర్ణీత రుసుం చెల్లించి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎంజీవీఎస్ కుమార్, సీనియర్ న్యాయవాదులు చందు, శ్రీనివాసరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీనివాస వార్షిక కల్యాణోత్సవాలు

కశింకోట: స్థానిక శివాలయం వద్ద ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి రెండు రోజులపాటు శ్రీనివాస వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. జ్యేష్ఠ మాసం ఏకాదశి పురస్కరించుకొని మొదటి రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయం వద్ద స్వామి కల్యాణోత్సవం వేద మంత్రాల నడుమ, శాస్త్రోక్తంగా జరగనుందన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఉదయం విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనం, రక్షా సూత్ర బంధన, దీక్షా ధారణ, ఉత్సవ ప్రారంభం, అభిషేకాలు, విశేష అర్చనలు జరుగుతాయన్నారు. ఈ నెల 8న సాయంత్రం 6 గంటలకు గరుడోత్సవం (తిరుర వీధి సేవ) జరుగుతుందన్నారు. ఉత్సవ విగ్రహాలను రథంపై గ్రామంలో ఊరేగిస్తామన్నారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రైతులకు అందుబాటులో బీఆర్సీ


జి. భీమవరంలో జీవ వైవిధ్య సాగును పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న


లాలంకొత్తూరులో కషాయాల తయారీ శిక్షణ పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

కశింకోట: ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాలు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడానికి బీఆర్సీ (బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్) కేంద్రాలను అన్ని యూనిట్లలో ఏర్పాటు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి లచ్చన్న కోరారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లాలంకొత్తూరులో ప్రకృతి వనరుల కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ద్రవ జీవామృతం, మీనా మృతం, విత్తన గుళికలు తయారీ గురించి డెమో నిర్వహించారు. జి. భీమవరంలో అనంతపురం మోడల్‌లో వేసిన అంతర్ పంటలు, జీవ వైవిధ్య పంటలను పరిశీలించారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను శిక్షకులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రమణ, కూండ్రపు అరుణ తదితరులు పాల్గొన్నారు.

'రజనీ కల్యాణం' చిత్ర యూనిట్ సందడి


ముత్యాలమ్మ గుడిలో క్లాప్ కొడుతున్న యూనిట్

సబ్బవరం: చినగొల్లలపాలెం ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద వారాహి క్రియేషన్స్ యూనిట్ గురువారం సందడి చేసింది.రజనీకల్యాణ్ పల్ల దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న రజనీ కళ్యాణం చిత్ర షూటింగ్‌ను అమ్మవారి సన్నిధిలో క్లాప్ కొట్టి, ప్రారంభించారు. పల్ల సత్యనారాయణ, పల్ల అప్పలనాయుడు నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నటీనటులు గెద్దం రమణ, శర్వాణి, సుస్మిత, కెమెరామన్‌గా రమణ, డ్యాన్స్ మాస్టర్‌గా దాలినాయుడు, ఫైట్ మాస్టర్‌గా సంతోష్ కుమార్, రచయితగా డి.శ్రీనివాసరావు పనిచేస్తున్నారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి


మాకవరంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కొణతాల



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ జోన్ శానిటరీ సిబ్బంది

అనకాపల్లి టౌన్: ప్రజలు, నాయకులు, సామాజిక కార్యకర్తలు అడవులు పెంపొందే విధంగా ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. సామాజిక వన విభాగం రేంజ్ ఆధ్వర్యంలో మండలంలోని మాకవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో క్వారీ, క్రషర్ యాజమాన్యాలు ఒక్కొక్కరు వంద మొక్కలను నాటి, వాటి పరిక్షణ బాధ్యతలు ఏడాది పాటు తీసుకోవాలన్నారు. తద్వారా కాలుష్యం నుంచి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సర్పంచ్ మెయ్య భవాని, నూకరాజు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ శానిటరీ సూపర్‌వైజర్ ఆర్ఆర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుడ్డ, నార సంచులు వాడాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వారవుతారన్నారు. ప్రతి పౌరుడు ఒక్క మొక్క నాటాలని కోరారు. స్వచ్ఛ భారత్ ఇన్‌చార్జ్ డి. భాస్కర్‌రావు, ఎస్ఐలు ఎం. అప్పారావు, సిహెచ్ గణేష్, సిహెచ్ మాణిక్యాలరావు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ మళ్ల జగదీష్

కశింకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. మండలంలోని సోమవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, ఏపీవో ఎం. శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ రవికుమార్

పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే మానవాళిని కాపాడుకున్నట్లేనని వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ మళ్ల జగదీష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అగ్రహారం వీధిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఏపీ జీవ వైవిధ్య సంరక్షణ పురస్కార గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, విశ్వభారతి కళాశాల ప్రిన్సిపాల్ మళ్ల మురళి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపు దుర్మార్గం

మునగపాక: కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును తక్షణమే రాష్ట్రంలో నిలుపుదల చేయాలన్నారు. 8 గంటల పని కోసం 1886లో చికాగోలో పోరాడి సాధించుకున్న కార్మిక వర్గంపై 12 గంటల పనిని రుద్దడం ప్రజా వ్యతిరేకమన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు లాభం చేకూర్చేందుకు పని గంటల భారాన్ని మోపుతుందన్నారు. కనీస వేతనాలు పెంచకుండా కార్మికుల శ్రమను తక్కువ చేసి చూపిస్తున్నారన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను దాని అనుబంధ రూల్స్‌ను ఉప సంహరించుకోవాలన్నారు.

ఏఎంఏఎల్ కళాశాల కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న వర్తక సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: ఏఎంఏఎల్ కళాశాల నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం స్థానిక కళాశాల ఆవరణలో జరిగింది. వర్తక సంఘం అధ్యక్షుడు తమ్మన రఘుబాబు, కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడిగా శ్రీధరాల కృష్ణపేరాజు, కరస్పాండెంట్‌గా పెంటకోట వెంకట రామారావు, కార్యవర్గ సభ్యులుగా పెంటకోట ఉమామహేశ్వరావు, పెంటకోట బాలకృష్ణ, కర్రి శివ సూర్యనారాయణ, కాండ్రేగుల రవీంద్రనాథ్, దొడ్డి నూక అప్పారావు, వాసిరెడ్డి బాలకృష్ణ, బొండాడ రాజేష్, ఉద్దగిరి కిశోర్ ప్రమాణం చేశారు. వర్తక సంఘం ఉపాధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, కార్యాలయ పర్యవేక్షకురాలు పెంటకోట అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.